# జానెడు స్వర్గం

కళ అనేది ఎవరి స్వంతమూ కాదు. అది చూసే హృదయంలో వుంది. మెచ్చుకునే మనసులో వుంది. ఆనందించే అంతరంగంలో వుంది.

బస్సు కిటికీలోనించి గాలికి తలలూపుతున్న కొబ్బరి చెట్లు. సూర్యాస్తమయ సమయంలో ఎర్రటి సముద్రం ముందు మనుష్యుల నల్లటి నీడలు. చీకటి గదిలోనించీ నల్లటి కిటికీ ఊచల సందులలో రోడ్డు మీద సందడి. గోడ మీద పిల్లి. కళ్ళు మూసుకుని గుక్కపట్టి ఏడుస్తున్న పిల్లాడు. బక్కెట్లో నీళ్ళు. రోడ్డు మీద పరుగెత్తే కుంటి కుక్క. అనంతవాహినిలో రైలు పట్టాలు. ఇలా ఎన్నో ఎన్నెన్నో చక్కటి ఫొటోలు. జానా కంటికి కాదేదీ కళకి అనర్హం.

వాళ్ళనీ వీళ్ళనీ పట్టుకుని కలకత్తా ఆక్స్‌ఫర్డ్ బుక్ స్టోర్‌లో ఒక ఆర్ట్ ఎగ్జిబిషన్ పెట్టించింది. కొనుక్కునేవాళ్ళు ఫొటోలు కొనుక్కోవచ్చని కూడా చెప్పింది. ఎవరి ఫొటోల డబ్బు వారిదే అదీకాక అది చూడటానికి వచ్చిన కళా హృదయులకి ఈ చిన్ని కళాకారులని పరిచయం చేసింది. అవిజిత్ ఫొటోని కొనుక్కున్న ఒకావిడ అతన్ని ఆటోగ్రాఫ్ చేసి ఇమ్మంది. అతను సంతకం చేస్తూ 'నా చెయ్యి వణుకుతున్నది' అన్నాడు అమాయకంగా. పిల్లల తల్లిదండ్రులనీ ఆహ్వానించింది జానా. వచ్చినవాళ్ళు మొదటిసారిగా చూశారు వాళ్ళ పిల్లలు చిన్నవాళ్ళు కాదనీ చిత్రకవాళ్ళనీ. మర్నాడు న్యూస్ పేపర్‌లో కూడా వచ్చిందా వార్త. స్టార్ టీవీ ఈ 'పెద్ద' కళాకారుల చిత్రాల్నీ చూపించింది. పిల్లలందర్నీ షాపులకి తీసుకువెళ్ళి మంచి బట్టలు కొనిచ్చింది జానా. వాళ్ళ జీవితాల్లో అదొక పండగ మరి.

న్యూయార్క్‌లో రాబర్ట్ ప్లెడ్జ్ కాంటాక్ట్ ఇమేజెస్ కంపెనీ నడుపుతున్నాడు. జానా పంపిన ఫొటోలు చూసి వారి సహజ కౌసల్యం చూసి ముచ్చట పడ్డాడు. ఇంకా సాధన చేస్తే గొప్ప కళాకారులవుతారని కలకత్తా వచ్చాడు. తనకి తెలిసిన మెళుకువలన్నీ నేర్పాడు. ముఖ్యంగా అవిజిత్, పూజ, గౌర్, శాంతిలకి. సరదాగా వాళ్ళతో కలిసిపోయి తన సహాయం తను చేశాడు రాబర్ట్.

'మనిషి ప్రవర్తనని కొంచెం దీక్షగా చూస్తే వింతగా వుంటుంది. ఆ రకరకాల ప్రవర్తననే ఫొటోలుగా చిత్రించటం నాకు ఇష్టం' అంటాడు గౌర్.

ఆనందంగా వుండాలంటే ధనవంతులే అవసఖ్ఖర్లేదు. నాలాటి వాళ్ళు కూడా వుండొచ్చు' అంది పూజ చక్కటి ఫొటోలు తీస్తూ.

ఇన్ని పనులు చేస్తున్నా, తను అనుకున్నది మరిచిపోలేదు జానా. అదే ఈ తొమ్మిదిమందినీ స్కూళ్ళల్లో చేర్పించటం. స్కూల్లో చేర్చుకోవటానికి వున్న అడ్డంకులనే ఎలా దాటాలా అని తల పగలకొట్టుకుంటుంటే, ఇంకో సమస్య వచ్చింది. పిల్లలందరికీ ఎయిడ్స్ లేదని సర్టిఫికెట్లు తెమ్మన్నారు. 'వీళ్ళందరూ చిన్న పిల్లలు. అదెందుకు' అడిగింది జానా. వాళ్ళు పెరిగే వాతావరణం అలాటిది కనుక అని సమాధానం. దానితో అందరికీ రక్త పరీక్షలు. మళ్ళీ డబ్బు ఖర్చు. డాక్టర్ల జులుం.

అన్నీటికీ సిద్ధపడింది జానా. డాక్టర్ రిపోర్ట్ వచ్చే దాకా ఆదుర్దాగానే వుంది. చివరికి రక్త పరీక్షలో ఎయిడ్స్ లేదనీ తేలింది. దాంతో మళ్ళీ ఊపిరి పీల్చుకుంది జానా.

పిల్లల వెల్‌ఫేర్ డిపార్ట్‌మెంట్ నించీ, కొన్ని స్వచ్ఛంధసేవా సమితుల దాకా తిరిగింది. చివరికి సబేరా ఫౌండేషన్‌లో పిల్లలందరికీ సీట్లు సంపాదించింది. స్కూల్లో చదువే కాదు, అక్కడే భోజనం, నివాసం. అదొక బోర్డింగ్ స్కూల్ అన్నమాట. కాకపోతే ఒక్కటే కండిషన్. సాధ్యమైనంత వరకూ చదువు పూర్తికాకుండా మధ్యలో వెళ్ళిపోము, చదువే ప్రధానం అని మాట ఇవ్వాలి. అలాగే చేస్తారందరూ. అందరికీ కొత్త బట్టలు కొనిస్తుంది జానా. పిల్లలు వాళ్ళ పెద్దవాళ్ళ కాళ్ళకి దణ్ణాలు పెట్టి బోర్డింగ్ స్కూల్‌కి బయల్దేరతారు.

టాక్సీలో శాంతి అప్పగింతల ఏడుపుని పూజ ఓదారుస్తుంది. స్కూల్లో గదులూ బాగున్నాయి. శుభ్రంగానూ వున్నాయి. కంప్యూటర్‌లూ వున్నాయి. అంతా బాగానే వుంది కానీ, ఆహారమే శాకాహారమయిపోయింది!

న్యూయార్క్‌లో రెండు ఫోటో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తుంది జానా. అక్కడ జనం ఫోటోలని చూడటం మెచ్చుకోవటం కొన్నిటిని కొనటం అంతా విడియో చూపిస్తుంది. పిల్లలు ఆనందంతో ఒకళ్ళనొకళ్ళు మెచ్చుకుంటారు. ఇదిగో అవిజిత్ ఫోటో, ఇది శాంతిది అని ఉత్సాహంగా చెప్పుకుంటున్నప్పుడే మిగతా విశేషాలూ చెబుతుంది జానా. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వారి కాలెండర్లో వీళ్ళ ఫోటోలు వేస్తున్నారని. ఇంకావుంది. అక్కడవున్న ప్రపంచ ప్రఖ్యాత కంపెనీ 'సూత్‌బీస్' వీరి ఫోటోలని వేలంపాటలో అమ్మకానికి పెడుతున్నదనీ. న్యూయార్క్ పేపర్లో పడ్డ అవిజిత్, శాంతి, గౌర్‌ల రంగుల ఫోటోలూ చూపించింది. ఎడారిలో వసంతం ఎలా వుంటుందో తెలియని వాళ్ళకి, ఈ పిల్లల ముఖాలు చూస్తే అదేమిటో స్పష్టంగా తెలుస్తుంది.

ఇంకొక ప్రత్యేకమైన విశేషం కూడా వుంది. హాలెండ్‌లోని యాంస్టర్డాంలో వరల్డ్ ప్రెస్ ఫోటో ఫౌండేషన్ ఏటేటా ఒక ఫోటో ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంది. ప్రపంచంలోని అన్ని దేశాలనించీ నాలుగు వేల యువ ఫోటోగ్రాఫర్ల ఫోటోలని ఆహ్వానిస్తుంది. వాటిలో గొప్ప ఫోటోలని తీసిన పదిమందిని యాంస్టర్డాంకి పిలిపించి ఆ ఎగ్జిబిషన్ సమయంలో వారం రోజులు వారికి ఆతిధ్యమిస్తుంది. అక్కడికి దాకా రావటమే ఫోటోగ్రాఫర్లకి ఒక పెద్ద సన్మానం. అందులోనూ అది ప్రపంచపరంగా జరిగేది కనక, ఎంతో ప్రజ్ఞ వున్నవాళ్ళకే అంతదాకా రావటం కష్టం. అవిజిత్, శాంతిల ఫోటోలు పోటీకి పంపించానని చెప్పింది జానా. అవిజిత్‌ని ఇంకా ఎన్నో కళాత్మకమైన ఫోటోలు తీయమన్నది. కానీ అప్పుడే వచ్చిపడింది ఇంకొక సమస్య. ఒక తాపిగాడు, అంటే కష్టమర్లని వ్యభిచార గృహాలకి తెచ్చే పింప్ అవిజిత్ అమ్మని చంపేశాడు. 'వాడికిక ఫోటోలూ వద్దు చదువూ వద్దు. ఇక్కడే వుంటాడు' అంది అమ్మమ్మ. 'స్కూలుకి వెడతాను. గ్రేడ్స్ బాగా వస్తే ఇంకా మంచి స్కూలుకి వెడతాను. డాక్టర్ని అవుతాను' అన్న అవిజిత్ అసలు ఏదీ చేసేటట్టు లేడు. ఒకవేళ అతని ఫోటోలు హాలెండ్‌లో సెలెక్ట్ అయి అతనికి ఆహ్వానం వస్తే... మరి మాట వింటాడా?

జీవితాన్ని ప్రోగ్రామింగ్ చేసి, ఇలా నడు అంటే నడవదు మరి. మానిక్

నాన్నకి వాడిని స్కూలుకి పంపించటం ఇష్టం లేదు. వాడినీ వ్యాపారంలోకి దించాలనుకున్నాడు. అందుకే చదువు మానిపించి ఇంట్లో వుంచేశాడు. పూజని వాళ్ళమ్మ స్కూలు మానిపించేస్తుంది. 'నేను చచ్చిపోయాక నువ్వూ నీ చెల్లెలూ బతకాలంటే ఇదే మార్గం' అంటుంది. శాంతి ఎవరికీ చెప్పకుండా తనంతటి తానే స్కూలు మానేస్తుంది. చదువు వద్దని ఇంట్లోనే వుంచేసిన తపసి, ఇంట్లోనించీ పారిపోయి స్కూల్లో చేరుతుంది. గౌర్ ఇంట్లోనే వుంటూ, ఏదో ఒకరోజు యూనివర్సిటీలో చదవాలని కలలు కంటుంటాడు.

తను ఆశించినట్టుగానే అవిజిత్ ఫొటోలు హాలెండ్‌లో జడ్జీలకి నచ్చాయి. ప్రపంచపరంగా ఆహ్వానింపబడిన తొమ్మిదిమందిలో అవిజిత్ ఒకడు. భారతీయ యువ కళాకారులకే అది ఒక సన్మానం అన్నారు ఉత్తరంలో. జానా ఆ మాట చెప్పగానే అవిజిత్ కళ్ళు ఒక్క క్షణం మెరిశాయి కానీ, అమ్మమ్మ ఒప్పుకోదని అతని అనుమానం. తన పనులేమవుతాయని బెంగ. చివరికి అందరినీ ఒప్పిస్తుంది జానా. ఇక పాస్‌పోర్ట్ రావాలి. మన గవర్నమెంటాలిటీ జానాకి కొత్త కాదు. నానా అవస్థలూ పడి, చివరికి తనే పై ఆఫీసరులని కలిసి, ఎలాగోలా సంపాదిస్తుంది. అవిజిత్‌కి కావలసిన బట్టలూ మొదలైనవి కొంటుంది.

ఎయిర్‌పోర్ట్‌కి టాక్సీలో వెడుతుంటే 'నెమ్మదిగా పోనీ. కారు ప్రమాదం అయితే నాకు అవకాశం పోతుంది' అంటాడు. ఇక అతనికి విమానం ఎక్కడమూ మొదటిసారే. తర్వాత జీవితంలో చూసినవీ చేసినవీ అన్నీ మొదటిసారే. ఫొటోలు తీస్తూనే వుంటాడు. సంతోషం స్పష్టంగా కనిపిస్తుంది అతని చేతల్లో, మాటల్లో. ఫొటో ఎగ్జిబిషన్‌లో అభినందనలు ధన్యవాదాలు ఎలా చెప్పాలో, ఎలా నెమ్మదిగా మాట్లాడాలో పక్కనే వుండి చెబుతుంటుంది జానా. ఆవిడే అతనికి అనువాదకురాలు. ఆటోగ్రాఫులు చేస్తాడు. అందరూ షేక్ హాండ్లు ఇస్తుంటే భారత శాంతి రాయబారిలా కనిపిస్తాడు.

బురదలో ఒక బంతి పూవు. జానా తన సహాయంతో, ఆసరాతో జానెడు స్వర్గాన్ని చూపించింది. అతనికి అది జానెడు కాదు. ఉన్నతమైన భవిష్యత్తుకి బంగారు బాట. ఇక ఏ బాటలో వెళ్ళాలో అతని చేతిలోనే వుంది.

ఇంకొకరి చేయి ఆసరా ఇస్తుందే కానీ, మన అడుగులు మనమే వేయాలి. అదే కదా జీవితం!

మరి ఈ కథ ఎవరిది? నిస్వార్థంగా, దేశం కాని దేశం వచ్చి, సమాజం చీదరించుకునే ఒక పసివాడికి కొత్త జీవితం చూపించిన జానాదా! తనలో వున్న కళా సృష్టిని నిలబెట్టుకుంటున్న పసివాడు అవిజిత్‌దా? సమాజంలో వున్న నిస్సహాయతనీ, దోపిడీనీ నగ్నంగా చూపించిన ఈ డాక్యుమెంటరీదా?

అవన్నీను. కానీ వాటికి మించిందొకటుంది.

ఇది మనిషికీ మనిషికీ మధ్య వున్న మానవత్వం కథ!

0 0 0